

# కాంతమ్మ కాపరం

శ్రీ కే వి జి రామారావు బి ఏ

ఎడోనాటి పురిటిలోనే కాంతమ్మ తల్లి కాలధర్మం పొందింది మళ్ళీ పెళ్ళాడితే మంచిదాన్ని ఎన్నుకోండి యీ పసకూన బాగుకోసరం అని ఆఖరుమాటగా అడిగింది ఆమె భర్తని మళ్ళీ పెళ్ళిచేసుకుని నీ ఆత్మకి యీ ఎల్ల జీవితానికి ద్రోహంచేయను అని అప్పటి దుఃఖపు వేడిలో ప్రమాణం చేశాడు పద్మనాభం

ఆ ఎడురోజుల ఎల్లను అతి ఆప్యాయంతో పెంచేడు రోజు రోజుకు ఆ ఎల్ల అందంలోనూ చురుకుతనంలోనూ బలంలోనూ అభివృద్ధి చూపించింది కాంతమ్మకి లోటు లేకుండా పద్మనాభం పాలతల్లులను పెట్టేడు పాడి యావులను పెంచాడు జపాను బొమ్మలతో లక్కపిడతలతో గదుల నింపేడు కాంతమ్మ ఆటపాటలకి అభ్యంతరం లేకుండా తల్లికన్నా దయావంతుడని పేరుపొందేడు కాంతమ్మ శైశవం అలా గడిచింది

★

కాంతమ్మ కాస్త ఎదగగానే చదువు కొకరూ సంగీతానికి ఒకరూ సల్లాపాలకి ఒకరుగా ప్రైవేటు మేష్టర్లను పెట్టేడు పద్మనాభం తాను కోర్టుకు వెళ్ళడం కాంతమ్మ బడికి వెళ్ళడం యీ కాలం తప్ప మిగతాకాలం అంతా తండ్రీ ఎల్లా కలిసే వుండేవారు తన ప్రేమ వాత్సల్యాలచే పద్మనాభం ఆమెను అమ్మా అనుమాటకు అర్థము తెలియనీయలేదు

కాంతమ్మ బాల్యం అలా గడచింది

కాంతమ్మకి పెళ్ళియీడు రాగానే ఎన్నో సంబంధాలు వెదకి తుదకు విశ్వనాధానికి యివ్వడానికి నిశ్చయించేడు పద్మనాభం అతనికి ఆస్తీ పాస్తీ అట్టేలేదుగాని ఆఖరియేడు ఆనర్సు క్లాసులో చదువుకొంటున్నాడు వయసు చిన్న అందం ఎక్కువ తెలివితేటలంతకన్నా ఎక్కువ ఎం ఎ ఫస్టుక్లాసులోనో ప్యాసవుతాడు తర్వాత ఎ పెద్ద వుద్యోగమో వస్తుంది ఆస్తి లేకపోతే ఎం ? నేను సంపాదించిదంతా కాంతమ్మదీ తద్వారా అతనిదీ కాదూ ? అని సమర్థించుకున్నాడు

కాంతం పెళ్ళి ముహూర్త బలిమివల్ల పద్మనాభం మునసబయ్యాడు పెళ్ళి చాలా డాబుగా చేశాడు ఎన్నా పెద్దా అంతా హర్షించారు తల్లంటే లేదుగాని కాంతమ్మకేమి తక్కువ అనిపించేడు అందరిచేతా

పండుగలకీ పర్వాలకీ వస్తూపోతూవున్న అల్లుడిని అందరు ఆఫీసర్లకీ క్లబ్‌లో ఎరుక పరచేవాడు పద్మనాభం మా అల్లుడు ఎం ఎ చదువుకుంటున్నాడు అని భేష్ ఇంకేం ? ఎ గెజిటెడ్ ఆఫీసరో అయిపోతాడు అని అడ్వాన్సుగా అందరూ అభినందించేరు

పరీక్ష ఫస్టుక్లాసులోనే ప్యాసయ్యేడు విశ్వనాధం ఎడాది గడచిపోయింది కాని అందరూ అనుకున్నట్లు కాలేజి ప్రొఫెసరూ కాలేదు పోలీసు సూపర్నెంటూ కాలేదు సర్వీసు కమిషన్ స్వయంవరంలో ఎన్నిసార్లు వరుడు కాబోయినా వటుడే అయి వూరకున్నాడు

ఈలోపలే అతనికి తండ్రిపోవడం చదువుకు వినియోగించిన ఆస్తిపోగా దాయాదులు మిగిలినది ఆక్రమణ చేయడం తటస్థించింది ఆ పద్మనాభం అల్లుడికి ఎ ఉద్యోగమూ యిప్పించలేకపోయాడు ఆ పరిస్థితులలో కాంతమ్మ కాపరానికి వచ్చింది గత్యంతరంలేక విశ్వనాధం మామగారి యింట్లోనే మకాం పెట్టేడు మొదట అల్లుడివైనా నీవే కొడుకువైనా నీవే అని అతడనటంచేత కాని కొన్నాళ్ళయాక అతనికి స్వయంకృషిమీద స్వతంత్రజీవనం చేసేవాడే యోగ్యుడు అని తట్టి మామగారు వద్దంటూవున్నా వినక మద్రాసు బయలుదేరి పోయాడు ఉద్యోగా

న్వేషణార్థం కొన్ని నెలలు ప్రయత్నంచేయగా చేయగా పీష్టనజీ అండు కంపెనీలో 30 రూపాయిల గుమాస్తాగిరి దొరికింది

★

కాంతమ్మ పుట్టింట వుండిపోయిన కాలంలో లోకులు నల్గురూ నాలుగు విధాలుగా అనుకున్నారు ఉద్యోగం సద్యోగం లేని మొగుడితో కాంతమ్మ ఎలా కాపరం చేస్తుంది? తండ్రి బోలెడు సంపాదించేడుగా? మొగుడికి వేరేవుద్యోగం ఎందుకు? విశ్వనాథం అందరిలాటి నీచపు మనిషికాదు పౌరుషవంతుడు కాబట్టే పట్నం వెళ్ళిపోయేడు ఎకాకిగా ఎలా వుంటాడు పద్మనాభం కాంతమ్మ కాపరానికి వెళ్ళిపోతే?

ఈ ములుకులలాటి పలుకులు పద్మనాభం వినికిలోకి కూడా వచ్చేయి ఆలోచించుకోగా ఒకరోజున అతనికి జరిగిపోయిన జీవిత చరిత్ర జ్ఞప్తికివచ్చి కళ్లు చెమ్మగిల్లేయి కాంతమ్మ మొగుడింటికి వెళ్ళక తప్పదు విశ్వనాథం తన దగ్గర ఉండిపోడు ఉండిపోవడానికి తగుమైన ఉద్యోగం తానిప్పించలేక పోయేడు పద్మనాభం బరువు గుండెతో బంగళా అంతా కలయజూచాడు ఎడురోజుల పిల్లను యింతవరకూ పెంచాడు పెళ్ళిచేశాడు ఇక వెళ్ళిపోతే అంత ఇంటిలోనూ ఒంటిపిల్లి రాకాసిలాగ తానుండిపోవలసిందేనా?

మరి కొన్నాళ్ళకు మద్రాసునుంచి అల్లుడు వ్రాసిన పిడుగులాటి ఉత్తరం రానే వచ్చింది కాంతమ్మకు చూపించాడు కాంతమ్మ తలవంచుకుంది పద్మనాభం ఆమెను కౌగిలించుకుని ఆడుదానిలాగ ఏడ్చేడు ఒకరు కొకరు ధైర్యం చెప్పుకొని ప్రయాణ సన్నాహాలు కావించారు క్రొత్త సంసారానికి కావలసినవన్నీ పద్మనాభం కొని యిచ్చాడు స్వయంగా మద్రాసుకు వెళ్ళి కూతురిని అల్లుడికి అప్పజెప్పి వచ్చేశాడు

వచ్చేశాడు కాని పద్మనాభం మతి మద్రాసులోనే వదలి వచ్చేడు ఆ పెద్దయింటిలో అన్ని వస్తువులూ కాంతమ్మని గురించే నిశ్శబ్దవాక్కులతో అతనికి చెప్పేయి కాంతమ్మ ఆటవస్తువులు ప్రతీ గదిలోనూ వున్నాయి గోడలమీద వ్రేలాడు ఆమె ఫోటోలన్నీ ప్రక్క ప్రక్కవుంచి చూస్తే పసిప్రాయంనుంచి పెళ్లయినదాకా గడచిపోయిన కాంతమ్మ జీవితం కళ్ళకి కట్టినట్లగుపించింది పసుపు బట్టలతోనూ కర్పూర హారాలతోనూ కళ్యాణపుబొట్లతోనూ కాంతమ్మ విశ్వనాథాలు కలిసి తీయించుకున్న ఫోటో కాస్తసేపు చూసి

తండ్రి —(ఒక వస్తువునిచ్చి కుమారునితో) ఒరే దీనిని రెండో కంటికి తెలియకుండా జాగ్రత్తగా తీసుకెళ్లాలి సుమా

కుమారుడు —మరి దీన్ని ఒకచేత్తో పట్టుకుని రెండవచేత్తో కప్పుతూంటే రెండోకన్ను దేనితో మూసుకోవడము నాన్నా!

ఎరిగి ఎరిగి ఎలా పెళ్ళిచేశాను? అని పద్మనాభం అనుకున్నాడు అందరి తలిదండ్రులూ తనలాగే వాపోతే ఆడపిల్లల సంసారాలు ఎలా సాగుతాయో అతనికి అర్థం కాలేదు తల్లి దండ్రుల యిద్దరి మార్దవత్వం రంగరించి అతని గుండె లోపల రాశాడు భగవంతుడు అంచేతే అతనిని ఆ యెడబాటు అలా నీరసింప జేసింది కాంతమ్మే తన సర్వస్వం అని నమ్ముకున్నాడు ఆమె సౌఖ్యంకోసం తన స్వసౌఖ్యం వదులుకున్నాడు అల్లుడూ కూతురూ తన దగ్గిరే వుండిపోతారనుకుని పెళ్ళి చేశాడు కాని అలా జరగలేదు

పిచ్చివాడిలా అలా ప్రవర్తించి పద్మనాభం కొన్నాళ్ళకి విధిలేక మొండికెత్తిపోయాడు నిరుత్సాహుడయిపోయాడు ఏదో కోర్టుపని చూసుకోవడం క్లబ్బులో ముక్తసరిగా మూడు మాటలు మాట్లాడడం యింటికివచ్చి మూగవాడిలాగ కూర్చోడం అతనికి క్రమేపి అలవాటై పోయింది సెలవు దొరకినపుడు మాత్రం పట్టణంవెళ్ళి కాంతమ్మని చూసి వచ్చేవాడు

★

మునసబుగారి షార్టుహాండు రైటరు కాశీపతి ఆ ప్రొద్దున్న మామూలు ప్రకారం వచ్చాడు మునసబుగారు అందరిమీద చెప్పిన అసంఖ్యాకపు జడ్జిమెంట్లు అతడు రాసి టైపు చేస్తాడు కాని భగవంతుడు అతనిమీద వ్రాసివుంచిన జడ్జిమెంటు మార్చుకోలేక పోయిన మందభాగ్యులలో అతనొకడు లెక్కకు మిక్కిలియైన కూతుర్లుగల కుటుంబీకుడు కాశీపతి మునసబు లెందరో అతని కళ్ళ ఎదుటనే జిల్లా జడ్జీలయిపోయారు కాని అతనికి ఆ కోర్టు ఆ ఊరు ఆ హోదాలోమాత్రం మార్పు ఏమీ కలుగలేదు అతనికి ఆరుగురు కూతుర్లు నల్గురుకూతుర్లకి ఎలాగ ఓలాగ పెళ్ళి చేశాడు కరణానికీ స్టాంపు వెండరుకీ ప్లీడరు గుమాస్తాకీ కాంపౌండరుకీ కట్టిపెట్టి ఇక పెళ్ళికావలసినవారు యిద్దరు ఆఖరుదాన్ని గురించి అతనికి ఆరాటం కలుగలేదు అయి

దేశ్ళు ఎల్లే కాబట్టి పంచమ పుత్రికారత్నం పార్వతికి 18 ఏళ్ళువచ్చాయి ఇంకా వరుడు కుదరలేదు అందచందాలు ఏమీ తక్కువలేవామెకు చదువు సంగీతాలకు అంతకన్నా లోటులేదు ప్రపంచజ్ఞానం ఎక్కువకాబట్టి తండ్రి తెచ్చిన సంబంధాలు ఆ ఎల్లకు ఎంతమాత్రం నచ్చలేదు ఇంత కన్నా మనతాహతుకు వేరే దొరకరు అని ఒకరోజు కాశీపతి ఆవూరి మునిసిపాలిటిలో బిల్లు కలెక్టరుగా పని చేస్తూవున్న కుర్రాడిని యింటికి తీసుకుని వచ్చాడు పార్వతి సౌందర్య ప్రభాలకి కళ్ళు జిగేలుమని ఎల్లాడు నచ్చింది నచ్చింది నచ్చింది అని మూడుసార్లన్నాడు కాని అతని ఆకారం హోదా చూసి పార్వతి యిలా అంది నల్గురు బావగార్ల జట్టులో ఇతణ్ణి చేరిస్తే రామాయణం భారతం అయిపోతుంది కాశీపతి హతాశుడై అప్పటికి పార్వతి పెళ్ళి ప్రస్తాపన మానుకున్నాడు

ఆఫీసువ్యవహారాలు అయిపోయాక అధికారి గుమాస్తా ఆ కబుర్లూ యీ కబుర్లలోకి దిగేరు

నాకు మునసబు పనికి రాజీనామా యిచ్చేద్దామని వుందోయి కాశీపతీ! అన్నాడు పద్మనాభం

కాశీపతి కళ్లు పెద్దవిజేసి చూశాడు

వెటకారం కాదు నిజమే ఇంతవరకు సంపాదించింది చాలు కాంతమ్మ మొగుడితో కాపరం చేస్తూవుంది వారిద్దరూ నా దగ్గరవుంటే అదొకదారి అన్నాడు పద్మనాభం

అధికార్లు మీతో అనరాదు కాని మీరు ప్రపంచం మీదివుద్దేశం మార్చుకోవాలి ఆడపిల్లలు కలకాలం మనల్నే కనిపెట్టుకుని ఉంటారండీ? నేను మొదట కూతురుపెళ్ళిలో అప్పగింతలప్పుడు కంటికీ మింటికీ ఏకధారగా ఏడ్చేను తర్వాత? నల్గురు కూతుర్లకీ పెళ్ళిజేసి అత్తవారింటికి పంపేనా లేదా?

మీదారి వేరండి!

అందరిదారీ ఒకటేనండీ అంచేత

అంచేత?

అంచేత మనసు చిక్కబట్టుకుని మళ్ళీ జీవితం ప్రారంభించాలి మీరే మళ్ళీ ఓ యింటివారైతే యింత సంపాదనా ఎందుకు అంటారు? ఒంటరితనంగా మోటు దేరిపోతారా?

పద్మనాభం ఉలిక్కిపడ్డాడు కాశీపతి తిరిగి అన్నాడు

కాంతమ్మ వెళ్ళిపోయింది కాని మీ కష్టాలు గ్రహించిందా? మీరు మళ్ళీ పచ్చగా అయితే కాంతానికి చెళ్ళెల్లు తమ్ముళ్లూ పుడితే మీరే అంటారు జిల్లా జడ్జీ యింకా కాలేదేం అని ఆ వచ్చేది అదృష్టవంతురాలయితే అదికావడం ఎంత సేపు? సెలవు

కాశీపతి సంభాషణానంతరం పద్మనాభానికి గాభరా మరీ ఎక్కువయింది పదహారేళ్ళనుంచీవున్న ధైర్యకంచుకం పట్ మని ఎగిరిపోయింది తన విధ్యుక్తధర్మం తాను చేయలేదని కాశీపతి చెప్పబోయాడు సామాన్యంగా అధికార్లను ఉబ్బింపజేసే మాటలుకావు అవి తాను ఒంటరిగా ఉండడం దుస్సహమే ఇన్నాళ్ళూ గడచేక పెళ్ళి చేసుకుంటే పదిమందీ నవ్వరూ? చనిపోయిన కాంతమ్మ తల్లి కలలో కనబడి యింతేనా నీ నిష అని చెప్పదూ? కాంతమ్మ ఏమనుకుంటుంది? ఆమె తన యింట్లో వుండలేక పోయింది అలాటప్పుడు తన స్వసౌఖ్య నిరాకరణ ఎందుకు? కాంతమ్మ తనకోసం తన కాపరం మానుకోలేదే కాంతమ్మ తల్లికూడా తనని పెళ్ళాడవద్దనలేదే? తండ్రి సౌఖ్యపడితే కాంతమ్మ వద్దంటుందా? మరి తను ముసలివాడు కాదూ? అద్దంలో ఒకసారి చూసుకున్నాడు తల కొంచెమే నెరిసింది అయితే యీకాలంలో పుట్టిన ఎల్లలకే జుట్టు నెరిసిపోతూవుంది ఊపిరి బిగబట్టి రెండు మోచేతులూ వంచాడు ఉబికేయి కండలు పదిసార్లు హాలులో పచారు చేశాడు నీ బలం అనుపమానం అని చప్పట్లు కొట్టి హర్షించినట్లు ఆ గచ్చు నేల ధక్ ధక్ మని ప్రతిధ్వనించింది మూలనున్న కరేలా పదిసార్లు గబగబా త్రిప్పేడు పది దండీలు యాభై బస్కీలు తీశాడు ఆయాసం పుట్టలేదు నలభైయైదు ఏళ్ళయితేనేం ధీమా ఉండాలి గాని అని అనుకున్నాడు ఫెన్సిసుబాటు పట్టుకుని కోర్టుకు వెళ్ళేడు ఆవేళ అతని ధాటికి ఎవరూ అడ్డు నిల్వ లేక పోయారు

(ఇంకా వుంది)

మేజిస్ట్రేటు — మళ్ళీ ఎందుకొచ్చావ్? ఇంక ఇక్కడికి రావద్దని చెప్పలేదురా?

దొంగ — నా మాటను ఈ పోలీసులు వినడం లేదు బాబయ్యా! మీరు చెప్పారని కూడా చెప్పాను

# కాంతమ్మ కాపరం



శ్రీ కే వి. జి. రామారావు బి. ఏ.

(గతసంచిక తరువాయి)

సాయంకాలం విసురుగా యింటికి వచ్చేసరికి వసారాలో కాశీపతి ప్రత్యక్షం "ఆఫీసు గొడవలుకావు చిన్న విన్నపం" అని కాశీపతి అడిగేడు

"నిర్మొహమాటంగా అడుగు" అన్నాడు పద్మనాభం

"ఇవేళ మాయింటికి విందుకు దయచేయాలి"

"అకారణ విందులకా ఆహ్వానం ?"

"అధికార్లు అనుగ్రహిస్తే అదే కారణం అవుతుంది. యివేళ మా పార్వతి పుట్టింరోజు."

-- సరే అన్నాడు పద్మనాభం.

వడ్డనకి నేతిగిన్నె పట్టుకుని పార్వతి వచ్చింది పద్మనాభం చూసేడు. వాకబుమీద ఆ అమ్మాయికే పెళ్ళికాలేదనీ, వయసు 18 యేళ్ళనీ, తక్కువవారిని ఒప్పుకోవడం లేదనీ తెలుసుకొన్నాడు పదిసార్లు నెయ్యివేసుకుని పార్వతి చక్కదనం పరిశీలించేడు. ఆ ఉంగరాల ముంగురులు, అనంగుడి ఉంగరపు త్రాళ్ళలాగ ఆ రింగుల లోలకులు, వంపులు తిరిగిన వళ్ళు, ఇంతవరకూ పార్వతిని ఏ మొగాడూ పెళ్ళాడలేదంటే మగ ప్రపంచం మృగ ప్రపంచంక్రింద మారివుండాలని పద్మనాభం నిశ్చయించేడు

తాంబూలం వేసుకుంటూ, కాశీపతి పద్మనాభాలు ఒకరి యిష్టాలు ఒకరితో ఒకేసారి చెప్పుకున్నారు. ఒప్పుకున్నారు.

★

కాంతమ్మ విశ్వనాధాలు పెళ్ళికి వచ్చేరు. ఆమె తండ్రి కార్యాన్ని ఆనందంతో మంజూరు చేసింది "నాన్నని జాగ్రత్తగా చూడు పిన్నీ" అని పార్వతితో చెప్పి మద్రాసువచ్చేసింది. సంవత్సరం తిరగకుండానే పార్వతి చక్కటి కొడుకును కనింది పార్వతి అదృష్టవంతురాలేయని సోదాహరణంగా చూపించింది? పద్మనాభంగారు సబుజడ్జీ అయ్యేరు

పార్వతి పరిణయంతో పద్మనాభం జీవితంలో రోజుకు రోజు మార్పు కలుగుతూ వచ్చింది. ఆ ఛాయ కాంతమ్మ కాపరంమీద ప్రతిబింబించింది. కాంతమ్మ కొడుకు బారసాలకుకూడా పద్మనాభం జోరుగా ఖర్చుపెట్టలేదు, పార్వతి హెచ్చరించుటచేత. పద్మనాభం మళ్ళీ పెళ్ళాడియుండకపోతే అతని ఆస్తిఅంతా ఆ కాంతమ్మ కొడుకుకే సంక్రమించి వుండేది కాని అంతలోనే ఆ మార్పు కలిగిపోయింది. అలా హెచ్చరించుటలో పార్వతి తప్పుకూడా లేదు సూక్ష్మదృష్టితో చూస్తే పద్మనాభం డబ్బుచూసే ఆమె పరిణయం ఆడింది పాతికేళ్ళ వయసు తేడా వున్నాకూడా తనూ పిల్లలను కంటూనే వుంది. వారు పెద్దవారయేసరికి పద్మనాభం అవతారం చాలించితే అవతల గతి ? అంచేత ఆమె అప్పటినుంచీ జాగ్రత్త పడింది అది అసమంజసం అని పద్మనాభం అనలేక పోయేడు పార్వతి పిల్లలను బికారుల చేయుట ద్రోహం అని తెలుసుకున్నాడు పార్వతి తనతో అన్యోన్యంగా కాపరం చేస్తూవుంది ఆమె యింటిలో అడుగుపెట్టినప్పటినుండీ తనకు అదృష్టం ఎక్కువౌతూవుంది, అలాంటి సమయంలో ఆమెను కాదని, కాంతమ్మ కాపరానికి ధారాళంగా విరాళం ఎలా యివ్వగలడు ? తనమీద ఆధారపడి అల్లుడు బదుద్ధాయి అయిపోయేడు అనికూడా అతనికి అనుమానంవేసింది ఆ అనుమానం క్రమేపి స్థిరపడిపోయి అత్లనిమీద జుగుప్సగా మారింది

ప్రజలుకూడా కాంతమ్మ కాపరంగురించి యిదివరకులాగ గందరగోళం పడడంలేదు. ఇప్పుడు వారి ప్రసంగంఅంతా జడ్జీగారు, పార్వతి, ఆపె పిల్లలనుగురించే కాంతమ్మ అందరి దృక్పధానికి దూరం అయిపోయింది

★

ఈలోపల విశ్వనాధానికి అదృష్టం ఎక్కువ ఏమీ కాలేదు. పార్కీ కంపెనీలో తప్ప పైచోట ఉద్యోగమే దొరకలేదు. మామగారి సహాయం తగ్గిపోయేక మరీ కష్టమని తోచింది అతనికి సంసారయాత్ర యుద్ధ ప్రారంభంలో అన్నిధరలూ ఎక్కిపోయి అతని ముప్పై రూపాయలూ ఏమూలకీ సరిపోలేదు. శరీరంకోరే ఆహారాన్ని సరఫరా చేయలేక పోవటంచేత అతడు ఆరోగ్యంకూడా క్షీణించి పోతున్నట్లు గ్రహించేడు శీశం అభి

వకీలు పార్టీతో —ఇవ్వాళ నీ కేసునుగురించి యెలా మాట్లాడినాననుకున్నావ్ జడ్జిగారు దంగయి పోయాడు ఘట్టిగా వాదించడములో తలనొప్పి గూడా వచ్చింది.

పార్టీ —అలానాండీ, పాపం! మీ కివాళ తలనొప్పి వచ్చిందిగాని, మీకు వకాల్తా యిచ్చినప్పటి నుండీ నాకు తలనొప్పిగానే వున్నదండి.

కొత్త సూర్యనారాయణ, తెనాలి,

వృద్ధికి యజమానిని ఎన్నోసార్లు అడుక్కున్నాడు. "నువ్వెళ్ళి పోతే నీతలదన్ననవాడు యింకొకడు యింకా తక్కువజీతానికి వస్తాడు" అని యజమాని మందలించేడు.

అతని దురదృష్టానికితోడు చంటి కుర్రవాడికి ఎప్పుడూ ఏదో రోగమే. మందులకీ మాకులకీ బోలెడు డబ్బు అయిపోయేది కాంతమ్మ అనుకూలవతి కాబట్టి సంసారంగుట్టు బయట పడకుండా కాలక్షేపం చేసుకుని వస్తూవుంది

ఒకరోజున పేష్కజీ అతనికి కబురుపంపి తనకూతురు బిజిలీకి ప్రయివేటు చెప్పితే పదిరూపాయిలు యిస్తానన్నాడు. విశ్వనాథం ఎంతో ఆనందంతో ఒప్పుకున్నాడు ఫలితం? అతడు ప్రొద్దున్న ఏడుగంటలనుండి రాత్రి తొమ్మిదిదాకా పనిచేయవలసి వచ్చింది. అయినా అతడు సిద్ధపడివుండునుగాని కొన్నాళ్ళకి బిజిలీ వెకిలిచేష్టలకు వెరచి ఆ ప్రయివేటు మానుకోవలసి వచ్చింది. బిజిలీ పదహారేళ్ళ పడుచు. చిన్నపిల్లకాదు. మళ్ళీ విశ్వనాథం యధాస్థితికి వచ్చాడు.

చంటి పిల్లవాడిరోగం నానాటికి ఎక్కువైపోయింది. ఏదో విపరీత జబ్బనీ రెండువందల రూపాయల ఫీజుకు ఒప్పుకుంటే స్పెషలిస్టు ఆ కేసు పడతానని విశ్వనాథంతో చెప్పేడు. అతడు వద్దంటున్నా కాంతమ్మ తండ్రికి జాబువ్రాసింది డబ్బు సర్దుబాటు చేయమని తన అసమర్థతను వెల్లడిస్తూ పద్మనాభం పదిరూపాయలు పంపించేడు.

రాత్రి తొమ్మిదిగంటలకు యింటికివచ్చిన విశ్వనాథానికి ఒళ్లో కుర్రాడిని పెట్టుకుని కూర్చున్న కాంతమ్మ కనబడింది. ఆ రాత్రి గడవదని తోచి విశ్వనాథం వెర్రివాడిలాగ పేష్కజీ యింటికి పరుగెత్తేడు పేష్కజీ గ్రామాంతరం వెళ్ళేడు అని తెలిసింది తన కష్టపరిస్థితులు చెప్పుకుని రెండువందల రూపాయలు యివ్వమని పేష్కజీ పెళ్లాంతో విన్నవించుకున్నాడు విశ్వనాథం. ఆ సమయంలో ఆ పార్శీ యువతి యీప్రపంచంలోలేదు. నాట్యగానోద్రేక పారవశ్యంవల్ల, ఆమె కళ్ళు కామోద్రేకంచేత గిరగిరా తిరిగేయి. ఆ దారిద్ర్య పిశాచగ్రస్తశుష్కకాయుడగు విశ్వనాథం ఆమెకాతరుణంలో మన్మధుడిలాగ కనబడ్డాడు కొన్ని వందల రూపాయలుతీసి తన కోరిక తీర్చమని అడిగింది విశ్వనాథాన్ని నిర్లజ్జయై "ఛీ" అని వెనుదిరిగివచ్చేసేడు విశ్వనాథం.

ఆరాత్రి విశ్వనాథం ఒడిలోనే పోయేయి ఆ చంటికుర్రాడి ప్రాణాలు.

★

చంటికుర్రాడి మరణం విశ్వనాథం మనోతత్వాన్ని పూర్తిగా మార్చేసింది. తన అప్రయోజకత్వమే ఆ మరణానికి కారణం అని అనుకున్నాడు. భార్యాపిల్లలని పోషించలేని మగవాని బ్రతుకెందుకు? ఒకరిమీద ఆధారపడడం బేలతనంకాదూ? అంచేత విశ్వనాథం అప్పటినుంచీ అతి పొదుపుగా కాలక్షేపం చేసేవాడు. తాను కష్టపడి అయినా కాంతమ్మ సౌఖ్యానికి భంగంరాకుండా చూసేవాడు కాఫీ వగైరా అభ్యాసాలను మానేసేడు కాలినడకనే ఆఫీసు రాక పోకలు జరిపేడు చింకిబట్టలే వేసుకునేవాడు అయినా మూప్పైరూపాయలు ఏమూలకి? ఒకప్పుడు భోంచేసేను అని కాంతమ్మతో చెప్పికూడా పస్తుపడుకునేవాడు. ఆకలి తీరడానికి మందేమేసా ఉంచే బాగుండేది అనుకున్నాడు

ఒకరోజు రాత్రి విశ్వనాథం ఆలస్యంగా యింటికి వచ్చేడు. కాస్త నేదదీరేక కాంతమ్మ అంది మెల్లగా "భోజనానికిలేండి ప్రొద్దోయింది"

"భోంచేసేను" అన్నాడు విశ్వనాథం నీరసపుగొంతు సవరించుకుంటూ.

"ఉత్తది. చెయ్యనట్లు మీ నీరసపు మొహం చెబుతూవుందేనా?"

"నిజం కాంతం! ప్రొద్దుపోయినదని హోటలులో భోంచేసేను. నాకోసం కనిపెట్టుకోలేదుగదా?"

"లేదు నాభోజనంకూడా అయిపోయింది" అని తొందరగా బదులుచెప్పింది కాంతం.

అనుమానంవేసి విశ్వనాథం వంటింటిలోకి వెళ్ళాడు వండిన అన్నం వండినట్లే వుంది కాంతంకేసి చూసేడు. తలవంచుకుంది. బియ్యపుడబ్బాకేసి చూసేడు ఖాళీగావుంది.

"జడ్జీకూతురువు నన్ను కట్టుకుని అన్నానికికూడా అగచాట్లు పడుతున్నావు" అన్నాడు విచారంతో విశ్వనాథం

"నాబోటి అభాగ్యురాలిని కట్టుకున్న మీ అదృష్టం అడ్డిపోతూవుంది. సగంమనిషి అయిపోయేరు మీరు యీ యాతనలవల్ల"

వండిన అన్నం యిద్దరూ సర్దుకుని తినేసేరు

ఆనాటి కాంతమ్మ కాపరం చూడడానికి ఎవరూ రాలేదు శారీరిక మానసిక వ్యధవల్ల మగడు నానాటికీ కృశించిపోతూన్నట్లు కాంతమ్మ గ్రహించింది ఏంచేయగలదు పాపం? ఎవరితో చెప్పుకోగలదు? దారితప్పి మదరాసువచ్చినా తండ్రి తన యింటికేనా వచ్చేవాడు కాదు ఉత్తర ప్రత్యుత్తరాలు ఎన్నాళ్ళకో గాని అసలే లేదు "ఈ దగ్గూ యీ యెండిన రొమ్మూ. వ్యవహారం ఏమీ బాగులేదుసుమండీ మీతర్వాతేఅంతా నాకోసం మీరెందుకు బాధపడుతారు? మందేమేనా పుచ్చుకోండీ, బలానికి" అని కాంతమ్మ మగనిని రోజూ బ్రతిమాలేది.

★

"ఏమీలేదు - ఊరికే సూసేదానికి వస్తిని" అన్నాడు మునుసామినాయుడు కుర్చీలో చతికిలబడుతూ.

"చాలా ధన్యుడిని" అన్నాడు విశ్వనాథం.

మునుసామినాయుడు పేష్టనజీ కంపెనీలో హెడ్డుగుమాస్తా.

కాంతం రెండు కప్పులలో కాఫీతెచ్చిపెట్టి వెళ్ళిపోయింది తెల్లబోయి తేరిపారచూచేడు నాయుడు ఆమె అపురూపసౌందర్యాన్ని

"ముప్పైరూపాయలలో యెలాభోంచేస్తావయ్యా" అని సానుభూతితో ప్రశ్నించేడు నాయుడు "జాస్తీ చెయ్యమని యజమానితో చెప్పేద్దానే"

"చెప్పేనండి మొన్న యిష్టంలేకపోతే వెళ్ళిపో అన్నాడు యజమాని" అన్నాడు విశ్వనాథం

ఒక్క వికృతపునవ్వు నవ్వేడు నాయుడు

"పేష్టనజీ అట్లాంటి మొర యినడు నీవు శుద్ధ పైత్తకారివి ఏమీ తెలవదు" అన్నాడు

"పోనీ ఏంచెయ్యాలో చెప్పండి" అన్నాడు ఆతుర్దాలో విశ్వనాథం

"అప్పిడివా, పేష్టనజీ నిండా కిలాడీ దయపెత్తే ఏమేనా సంబళం యిస్తాడు అట్లనేస్తే"

"ఏలాగ?"

"రామయ్యరు, ఆరుముగమొదలి ఇంకా ఎట్లనేసినారు."

విశ్వనాథానికి ఒళ్ళుమండిపోయింది పై చెప్పినవారు పై పదవికి ఎలా వచ్చేరో అతనికితెలుసు పైగా పార్శీవాడియింట్లో బండువాళం తెలిసేక అతనిపై రోతకూడా కల్గింగి

మరునాడు ఆఫీసుకుపోగా జరిగినదాన్నిబట్టి సా… హూరుడు నాయుడు అని తెలిసిపోయింది. సా… నజీ

గారడీవాడు,—నేను గారడీవిద్యల్ని చేస్తుంటే అందరూ ఆశ్చర్యపోతూ నవ్వుతూ వచ్చేవారు, అరవదేశంలో

స్నేహితుడు —అబ్బా, అంతబాగా చేశావా?

గారడీవాడు —నా మాటల్ని అరవంలోకి తర్జుమాచేసిన కుర్రాడు, నా ట్రిక్కుల్నికూడా చెప్పేసేవాడట.

విశ్వనాథాన్ని పిలిచి మరొకనెల ఆయినతర్వాత అతని నౌఖరీ తనకక్కరలేదని చెప్పేడు తనక్రింద భూమి అమాంతంగా కృంగిపోయి ఆకాశం అణచివేసినట్లు అనుభవించేడు విశ్వనాథం.

★

కాంతమ్మకిసంగతి చెప్పలేదుకాని ఆరోజునుంచి విశ్వనాథం మరీ కృశించిపోవడం మొదలెట్టేడు సాహసవంతుడికే అయిశ్వర్యం అబ్బుతుందని ఒకరోజున నిశ్చయించి, వార్ కమిటీ ఆఫీసుకువెళ్ళి లెఫ్టినెంటు వుద్యోగానికి దరఖాస్తుపెట్టి అధికార్లను చూచివచ్చేడు మరి నాల్గురోజులకు ఉత్తరంవచ్చింది, ఫలానితారీఖున మెడికల్ పరీక్షకు హాజరుకమ్మనమని. విశ్వనాథం ఆనందానికి అంతులేదు.

ఆ తారీఖున అక్కడ హాజరయేడు పరీక్ష అయింది. డాక్టర్లు మూతి విరిచేరు "విపరీత క్షయ" అని జబ్బు నిర్ణయించి పనికిరావు అని అన్నారు. "టి బి" పిశాచం. తన గొంతు పిసుకుతున్నట్లు అనుభవించి విశ్వనాథం పిచ్చివాడిలాగ బయటికి పరుగెత్తి వచ్చేసేడు

బీచిద్వారా నడిచివస్తున్న విశ్వనాథానికి పద్మనాభంగారు హఠాత్తుగా కారులో కనబడ్డాడు. "ఎన్నాళ్ళయింది వచ్చి" అని పల్కరించేడు

"రెండురోజులయింది."

"యింటికి రాలేకపోయారా? కాంతమ్మ మీకోసం కలవరించిపోతూవుంది"

వస్తా వస్తా యీ వూరిలో యింకా నాల్గురోజులుంటాను. కొన్ని అర్జెంటుపనులున్నాయి కాంతంతో చెప్పు వెళ్ళేటప్పుడు కనబడుతాను నువ్విలా అయిపోయేవేం? జబ్బు? మందు పుచ్చుకో" అని పద్మనాభం తొందరమాటలు మాట్లాడేడు.

★

దగ్గుతూ కుర్చీలో కూలబడ్డాడు విశ్వనాథం. "మందుపుచ్చుకోరూ? నామాటవిని" అని అంది కాంతమ్మ.

"పుచ్చుకుంటూనే వున్నాను మరేం భయంలేదని పెద్దడాక్టర్లు యివేళ చెప్పేరు"

"మాయమాటలలో నన్ను మభ్యపరస్తున్నారు" అని ఏడిచింది కాంతమ్మ

పద్మనాభం కనబడినటుల చెప్పేడు విశ్వనాధం, తండ్రి పరాఙ్ముఖతకు సిగ్గుపడిపోయింది కాంతమ్మ

మళ్ళీ విశ్వనాధం దగ్గేడు. మంచినీళ్ళు తీసుకువచ్చింది కాంతం ఉమ్మి కళ్ళలో రక్తంకనబడింది. "నాకోసరమేనా మందు పుచ్చుకోరూ" అని ఏడ్చింది

"బెదరిపోకు" అని అంటూ కాంతాన్ని దగ్గిరతీసేడు విశ్వనాధం.

నాల్గోనాడు రాత్రి విశ్వనాధానికి నిస్త్రాణ ఎక్కువయింది సగమురాత్రి గడచేక విశ్వనాధానికి మెలకువ వచ్చింది. కాళ్ళ దగ్గర పడుకున్న కాంతమ్మనుజూచి "ఎంతగతి పట్టింది" అని విచారించేడు, లేపేడు వెర్రి వెర్రిగా విశ్వనాధం చూడడం కాంతమ్మకి కంగారుపుట్టించింది.

"రేపు ప్రొద్దున్న మీ నాన్నవస్తాడు అతనితో వెళ్ళిపోకాంతం" అని అమ్మో అని గుండెలమీద చెయివేసుకున్నాడు విశ్వనాధం ఏమి చేమిటి అని కాంతం అతన్ని పట్టుకుని గుండెలమీద చేయివేసింది, ఉన్నట్లుండి ఆ అభాగ్యజీవిగుండె ఆగిపోయింది

అర్ధరాత్రిలో, శిథిలగృహంలో మృతభర్త కళేబరంపయిబడి ఏడ్చిన కాంతమ్మను ఓదార్చడానికేనా ఎవరూలేరు ప్రపంచం అంతా నిద్రలోవుంది

ఆవేశంతో లేచి కూర్చుంది కాంతం "హిందూస్త్రీలు వారితో వీరితో ఎందుకు వెళ్తారు? ఎవరితో వచ్చేనో వారితోనే పోతా" అని నిశ్చయించుకుంది చీరకొంగుకు దీపం ముట్టించింది భర్త కళేబరం ప్రక్క పడుకుంది ఆ యిల్లు పూర్తిగా కాలేక ఇరుగు పొరుగువారు లేచేరు

తెల్లవారి కూతురుని చూడడానికివచ్చిన జడ్జీ పద్మనాభంగారికి బూడిద తప్ప ఏం కనబడలేదు రాత్రి యిల్లుకాలిపోయి మరణించేరని అందరూ చెప్పేరు కాని ఆకలిబాధతో భర్త. అనుసరించి భార్య ప్రపంచానికి సలాంపెట్టి పోయేరని గ్రహించలేక పోయేరు.

---

# చేపలదుకాణం

"ఇచ్చట కొత్త చేపలు అమ్మబడును". అని బోర్డు కట్టిన కొట్టు దగ్గర —

ఒకడు —మీరు కట్టిన బోర్డులో అంతా బాగానేవుంది గాని, "కొత్త" అని ఎందుకు వ్రాయడం?

కొట్టుమనిషి —పాత చేపల్ని అమ్మను గనుక

ఒకడు —ఎవరుకొన్నా కొత్తచేపల్నే కొంటారుగాని, పాతవాటిని కొనరుగా?

కొట్టు మనిషి —అయితే "కొత్త"ను చెరిపేస్తాలే.

(చేపలు కొనడానికి మరొక మనిషివచ్చి —)

మనిషి —బోర్డులో "ఇక్కడ" అనేదానికి అర్ధంలేదు. చేపల్ని ఇక్కడ అమ్మక ఇంకెక్కడ అమ్ముతున్నావనుకుంటారు?

కొట్టుమనిషి —అయితే ఆ అక్షరాల్నిమాత్రం చెరిపించేస్తాలే.

(ఇంకొకడు వచ్చి —)

ఇంకొకడు —నీ బోర్డులో "అమ్మబడును" అనేమాట బాగాలేదు అమ్మక ధర్మం చేస్తావనుకుంటారా?

కొట్టుమనిషి —సరేలే, ఆమాటమీద నలుపు పూయించేస్తాలే

(చేపలకోసం వేరొకడువచ్చి)

వేరొకడు —నీ బోర్డుమీద "చేపలు" అనిమాత్రం వ్రాసి వుంచావు మహా విచిత్రంగావుందే!

కొట్టు మనిషి —చేపలు అమ్ముతాను గనుక అల్లా వుంచాను

వేరొకడు —మైలు దూరానికి కంపు కొట్టుతూవుంటే ఇక్కడ చేపలు అమ్ముతావని వేరే బోర్డు వుండాలా, వెర్రివాడా?